క్లుప్తంగా

దుర్గాడ శివాలయంలో ప్రత్యేక పూజలు



విశేష అలంకరణలో స్వామివారు

గొల్లప్రోలు: మాస శివరాత్రిని పురస్కరించుకుని బుధవారం దు ర్గాడ శివాలయంలో ప్రత్యేక పూజ లు నిర్వహించా రు. ఆలయ అర్చకులు చెరుకూరి వీరబాబు, దత్తు సోదరులు ఉదయం స్వామివారికి మహన్యాస పూర్వక రుద్రాభిషేకం, పంచామృతలతో అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక అలంకరణ చేసి భక్తులకు దర్శనాలు కల్పించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

వర్షంతో స్తంభించిన జనజీవనం



కొత్తపల్లిలో కురుస్తున్న వర్షం

కొత్తపల్లి: మండలంలోని బుధవారం కురిసిన వర్షానికి జన జీవనం స్తంభించింది. భారీ వాన కురవడంతో పలు ప్రాంతాలు జలమయమయ్యాయి. ఉప్పాడ బీచ్ రోడ్డు సెంటర్‌లో ఇరువైపులా ఉన్న డ్రైన్లు ఆక్రమణకు గురికావడంతో, మోకాల్లోతు నీరు నిలిచిపోయింది. ఉప్పాడ–పిఠాపురం రోడ్డులో పలుచోట్ల నీరు నిలిచిపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు.

సొసైటీ అధ్యక్షుడి రాజీనామా



జ్యోతుల భీముడు

గొల్లప్రోలు: విశాల సహకార పరపతి సంఘం అధ్యక్షుడు జ్యోతుల భీముడు రాజీనామా చేశారు. బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ ఓటమికి తనతో పాటు సభ్యులు రామిశెట్టి సత్తిబాబు, ఎనెటి బాబురావు నైతిక బాధ్యతగా భావించి రాజీనామా చేస్తున్నట్టు చెప్పారు. తమ రాజీనామా పత్రాన్ని జిల్లా కోఆపరేటివ్ సొసైటీ కాకినాడ (డీఆర్సీ)కి పంపినట్టు తెలిపారు.

సహకరించిన వారందరికీ ధన్యవాదాలు

– వైఎస్సార్ సీపీ పిఠాపురం అభ్యర్థి వంగా గీత



పిఠాపురం: సార్వత్రిక ఎన్నికల్లో సహకరించిన వారందరికీ ధన్యవాదాలు తెలుపుతున్నట్టు వైఎస్సార్ సీపీ పిఠాపురం అభ్యర్థి వంగా గీత తెలిపారు. ఆమె బుధవారం ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. పిఠాపురం నుంచి వైఎస్సార్ సీపీ అభ్యర్థిగా ఎన్నికల్లో పోటీ చేసిన సందర్భంగా పిఠాపురం ప్రజలందరూ పూర్తి సహకారం అందించారన్నారు. తన వెన్నంటి నిలిచిన వైఎస్సార్ సీపీ నాయకులకు, కార్యకర్తలకు, స్థానిక సంస్థల ప్రతినిధులకు, సంస్థాగత కమిటీల నాయకులకు, పెద్దలకు, మహిళలకు, యువకులకు, ముఖ్యంగా వైఎస్సార్ సీపీకి ఓట్లు వేసిన ఓటర్లకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. ఎన్నికల ప్రచారంలో పిఠాపురం ప్రజలు అందించిన సహకారం జీవితంలో మరువలేనని, ఎల్లప్పు డూ ప్రజలకు అందుబాటులో ఉంటూ, వారికి పూర్తి సహకారం అందిస్తానని ఆమె చెప్పారు.

దేశం మరింత ముందుకు వెళుతుంది

బోట్‌క్లబ్: ప్రధానమంత్రి నరేంద్రమోదీ నేతృత్వంలో దేశం మరింత ముందుకు వెళుతుందని బీజేపీ సీనియర్ నాయకులు పైడా కృష్ణమోహన్ అన్నారు. కేంద్రంలో మూడోసారి బీజేపీ ప్రభుత్వం విజయం సాధించినందుకు బుధవారం స్థానిక భానుగుడి సెంటర్‌లో మిఠాయి పంపిణీ చేశారు. దేశాన్ని రక్షించగల ఏకైక పార్టీ బీజేపీ ఒక్కటేనని ప్రజలు విశ్వాసం వ్యక్తం చేశారన్నారు. రాష్ట్రంలో కూడా ఎన్డీఏ కూటమి విజయం సాధించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. బీజేపీ నాయకులు ముత్తా నవీన్‌కృష్ణ, తుమ్మల పద్మజ, కవికొండల భీమశంకర్, మొసలగంటి సురేష్ పాల్గొన్నారు.

కిర్లంపూడిలో పోలీస్ పికెట్

కిర్లంపూడి: కిర్లంపూడిలో జగ్గంపేట సీఐ ఎస్.లక్ష్మణరావు ఆధ్వర్యంలో బుధవారం పోలీస్ పికెట్ కొనసాగింది. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాల్లో ప్రశాంత వాతావరణం కొనసాగుతోందన్నారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు గ్రామాల్లో అల్లర్లకు తావు లేకుండా స్థానిక ఎస్సై షేక్ జబీర్‌తో కలిసి పికెట్ నిర్వహిస్తున్నట్టు తెలిపారు.

విత్తన ఎంపికే కీలకం

- నేల స్వభావాన్ని బట్టి రకాలు ఎంపిక చేసుకోవాలి
- వరి నారుమడి తయారీలో యాజమాన్య పద్ధతులు అవశ్యం
- ఎంఏఓ ఏవీ రాజేష్



కరప ఆర్బీకేలో సిద్ధంగా ఉన్న స్వర్ణ రకం విత్తనాలు

కరప: ఖరీఫ్ సీజన్‌లో వరి ప్రధానమైంది. రైతులను ముందస్తు సాగుకు సమాయత్తం చేసేందుకు ఈ నెల ఒకటో తేదీనే కాలువలకు నీరు వదిలారు. నైరుతి రుతుపవనాలతో అక్కడక్కడ వర్షాలు పడుతుండడంతో కరప సబ్ డివిజన్ పరిధిలో రైతులు నారుమళ్ల తయారీకి ఉపక్రమిస్తున్నారు. అన్ని ప్రాంతాల్లో సార్వా సాగుకు రైతులు నిమగ్నమవుతారు. రైతులు తమ భూముల స్వభావాన్ని బట్టి రకాలు సాగుచేసుకోవాలని, వరి నారుమడి నుంచి యాజమాన్య పద్ధతులు పాటిస్తే తక్కువ పెట్టుబడులతో అధిక దిగుబడులు సాధించి, వ్యవసాయాన్ని లాభసాటిగా మలుచుకోవచ్చని మండల వ్యవసాయాధికారి ఏవీ రాజేష్ రైతులకు సూచనలు ఇచ్చారు. రైతులు మంచి దిగుబడులు సాధించాలంటే మంచి రకాల ఎంపిక, నారుమడి తయారీ, విత్తనశుద్ధి, ఎరువులు, పురుగుమందుల వాడకం, కలుపు నివారణలో యాజమాన్యం తప్పనిసరిగా పాటించాలి.

ఖరీఫ్ పంటకు అనువైన రకాలు

సాధారణ పరిస్థితులలో నాటడానికి ఎంటీయూ–7029 (స్వర్ణ), ఎంటీయూ–1061 (ఇంద్ర), ఎంటీయూ–1064 (అమర), బీపీటీ–5204(సాంబ మసూరి), ఎంటీయూ–1121 (శ్రీధృతి) రకాలు వాడవచ్చు. స్వర్ణకు ప్రత్యామ్నాయంగా కొత్తగా రూపొందించిన ఎంటీయూ–1318 రకాన్ని కూడా వినియోగించుకోవచ్చు. తక్కువ ఎరువులు వాడాల్సి ఉంటుంది. చేను పడిపోకుండా, నిలదొక్కుకుని ఉంటుంది. ముంపునకు తట్టుకుంటుంది. సన్నరకం సాంబమసూరికి ప్రత్యామ్నాయంగా ఎంటీయూ 1282 రకాన్ని కూడా సాగుచేసుకోవచ్చు.

విత్తన శుద్ధి

విత్తనం ద్వారా వ్యాప్తి చెందే కొన్ని రకాల తెగుళ్లు అరికట్టడానికి తప్పనిసరిగా విత్తన శుద్ధి చేయాలి. విత్తన శుద్ధి రెండు రకాలుగా చేసుకోవచ్చు. మొదటిది పొడి విత్తన శుద్ధి. దీనికి కిలో విత్తనానికి 8 నుంచి 10 గ్రాములు సూడోమోనస్ మందును కలిపి 24 గంటల తర్వాత నారుమడిలో చల్లుకోవాలి. రెండోది తడి విత్తన శుద్ధి. దీనికి ఒక లీటరు నీటిలో 10 గ్రాములు సూడోమోనస్ మందును కలిపి ఆ ద్రావణంలో ఒక కిలో విత్తనాల వంతున 24 గంటలు నానబెట్టి, మరో 24 గంటలు మండికట్టి మొలకవచ్చిన విత్తనాలను దమ్ముచేసిన నారుమడిలో చల్లుకోవాలి. విత్తన మోతాదు: వరినాటే పద్ధతిలో ఎకరానికి 25 నుంచి 30 కిలోలు, వెదజల్లు పద్ధతిలో ఎకరానికి 12 కిలోల విత్తనాలు సరిపోతాయి.

నారుమడి పెంపకం

దృఢమైన, ఆరోగ్యవంతమైన నారు పొందాలంటే నారుమడిని 12 రోజులు ముందు దమ్ముచేసి, చిన్న మడులుగా విభజించుకోవాలి. నీరు పెట్టడానికి, తొలగించడానికి వీలుగా కాలువలు ఏర్పాటు చేసుకోవాలి. ప్రతి సెంటు భూమిలో ఐదు కిలోల వంతున విత్తనాలు చల్లుకోవాలి. విత్తనం ఎక్కువైతే నారు బలహీనంగా ఉండి, మాగుడు తెగులు సోకే అవకాశం ఉంది. ఎక్కువ విత్తనాలు పోస్తే నారు తీసేటప్పుడు వేర్లు తెగిపోయి సులువుగా రాదు. ఒక ఎకరానికి 5 సెంట్ల నారుమడి సరిపోతుంది. మొలక కట్టిన విత్తనాన్ని పచ్చటి నీటిమీద చల్లుకోవాలి. నారు రెండుమూడు ఆకులు తొడిగే వరకు ఆరుతడి పెడుతూ ఉండాలి. తర్వాత పలుచగా నీరుండేలా చూసుకోవాలి.



ఏవీ రాజేష్, కరప మండల వ్యవసాయాధికారి

నారుమడి–ఎరువుల యాజమాన్యం

దమ్ములో ప్రతి ఐదు సెంట్ల నారుమడికి 2 కిలోల యూరియా, 7 కిలోల సింగిల్ సూపర్ పాస్ఫేటు, 2 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్ వంతున వేసుకోవాలి. విత్తిన రెండు వారాల తర్వాత మళ్లీ 2 కిలోల యూరియా పైపాటుగా వేయాలి.

నారుమడిలో సస్యరక్షణ

అవసరాన్ని బట్టి నారుమడిలో సస్య రక్షణ చర్యలు చేపట్టాలి. నారుమడి దశలో కాండం తొలుచుపురుగు, ఉల్లికోడు, పచ్చ దీపపు పురుగులు, తాటాకు పురుగు, తామర పురుగులు, నారు కత్తిరించే పురుగులు కనిపిస్తుంటాయి. వీటి నివారణకు క్లోరిపైరిపాస్ 2.5 మిల్లీ లీటర్లు లేదా ప్రొఫినోఫాస్ 2 మిల్లీ లీటర్ల వంతున ఏదో ఒక మందును లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. లేదా నారుతీసే వారం రోజులు ముందు కార్బోఫ్యూరాన్ 3జి గుళికలను సిఫార్సు చేసిన మోతాదులో చల్లుకోవాలి. రైతులు ఎప్పటికప్పుడు వ్యవసాయశాఖ సిబ్బందిని కలిసి తగిన సలహాలు పొందాలని ఎంఏఓ రాజేష్ సూచించారు. మండలంలోని ప్రతి రైతు భరోసా కేంద్రంలో సార్వా విత్తనాలు అందుబాటులో ఉన్నాయి. 30 కిలోల విత్తనాల బ్యాగ్‌కు రూ.150 వంతున రాయితీ ఇస్తున్నారని, రాయితీ పోను రైతు రూ.1044 చెల్లించాలి. అలాగే విత్తన శుద్ధికి సూడోమోనస్ మందును 100 గ్రాములు ప్యాకెట్‌కు రూ.50 రాయితీ పోను రూ.100కు ఇస్తున్నట్టు ఆర్బీకే వీఏఏ కె.ప్రశాంత్ తెలిపారు.

ఘనంగా నేరేళ్లమ్మ తల్లి జాతర



ఉత్సాహంగా నిర్వహిస్తున్న గరగ నృత్యాలు

కొత్తపల్లి: మండలంలోని కొమరగిరి గ్రామ దేవత నేరేళ్లమ్మ తల్లి జాతరను బుధవారం ఘనంగా నిర్వహించారు. గ్రామంలో చిరుతాడిని గరగ నృత్యాలతో ఊరేగించారు. ఆలయాన్ని విద్యుద్దీపాలతో అలంకరించారు. గత 15 రోజులుగా గ్రామంలో ప్రతి రోజూ గరగ నృత్యాలు నిర్వహిస్తున్నారు. గురువారం అమ్మవారి తీర్థాన్ని నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. భక్తులకు అన్ని సౌకర్యాలను ఏర్పాటు చేసినట్టు చెప్పారు.



గ్రామంలో చిరుతాడిని ఊరేగిస్తున్న భక్తులు

స్థూపాన్ని కూల్చిన వారిని అరెస్టు చేయాలి

తాళ్లరేవు: అమలాపురం శివారు చింతపల్లివారిపేటలో జైభీమ్ స్థూపాన్ని మోటార్ సైకిల్‌తో ఢీకొట్టిన వ్యక్తులపై కేసు నమోదు చేసి, అరెస్టు చేయాలని విశ్వజన కళా మండలి రాష్ట్ర అధ్యక్షుడు వడ్డి ఏడుకొండలు బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఇద్దరు జనసేన కార్యకర్తలు మద్యం మత్తులో ఈ అఘాయిత్యానికి పాల్పడ్డారని, వారిని కఠినంగా శిక్షించాలన్నారు. దళితులపై దాడులు జరగకుండా నూతన ప్రభుత్వం కఠినమైన చట్టాలు తేవాలని కోరారు.

వైభవంగా నీలమ్మ జాతర

భక్తిశ్రద్ధలతో గరగ నృత్యాలు



సామర్లకోటలో వేంచేసి ఉన్న నీలమ్మ అమ్మవారి ఆలయం వద్ద గరగల నృత్యం

సామర్లకోట: స్థానిక నీలమ్మ చెరువు వద్ద ఉన్న నీలమ్మ తల్లి ఆలయంలో బుధవారం రాత్రి గరగల నృత్యంతో జాతర ఉత్సవాలు నిర్వహించారు. పట్టణ ప్రజలకు తాగునీటి కోసం సుమారు 130 ఏళ్ల క్రితం పట్టణ ముఖ్య కూడలిలో చెరువు తవ్వకం చేస్తున్న సమయంలో చిన్న రాతి విగ్రహం బయట పడింది. దాంతో ఆ అమ్మవారిని నీలమ్మగా గుర్తించడంతో పాటు చెరువుకు నీలమ్మ చెరువుగా నామకరణం చేశారు. ఆ రాతి విగ్రహానికి చిన్న గుడి కట్టించి ప్రతి రోజు ధూప దీప నైవేద్యాలు పెడుతున్నారు. ఈ మేరకు ఏటా జూన్ మాసంలో ఉత్సవాలు నిర్వహించడం ఆనవాయితీగా మారిందని నిర్వాహకులు తెలిపారు. అమ్మవారి జాతరలో భాగంగా గురువారం సిరి బొమ్మ ఊరేగింపు నిర్వహిస్తున్నట్టు ఆలయ కమిటీ నాయకులు తెలిపారు. కొంత మంది యువకులు కమిటీగా ఏర్పడి ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. ఈ మేరకు ఆలయానికి రంగులు వేసి విద్యుద్దీపాలంకరణ చేశారు.

దళిత వేదన పుస్తకావిష్కరణ

యానాం: నిబద్ధ ఉపాధ్యాయునిగా సేవలు అందించడమే కాకుండా, ఆనాడు దళితులు ఎదుర్కొన్న ఘటనలను పద్య, గద్య, గేయాలుగా కొల్లి వెంకన్న మాష్టారు రచించిన పుస్తకం వేదనా తరంగమని పలువురు వక్తలు పేర్కొన్నారు. బుధవారం స్థానిక సర్కిల్ ది యానాంలో దళిత వేదన పుస్తకావిష్కరణ కార్యక్రమం ప్రముఖ కవి కథకుడు, దాట్ల దేవదానంరాజు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దళిత వేదన పుస్తకంలోని పలు అంశాలను విశ్లేషించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న పొనుగుమట్ల విష్ణుమూర్తి మాట్లాడుతూ తొలిదశలో దళిత ఉద్యమంలో వెంకన్న మాష్టారి పోరాటం తదితర అంశాలను వివరించారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఆర్ఎఓ నామాడి అప్పారావు, విశ్రాంత ఎస్సీ కార్పొరేషన్ ఈడీ కొల్లి సత్యనారాయణ, పిల్లి రాంబాబు, గుత్తాల శ్రీరాములు, భూషణం, కుంచే సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మొక్కల పెంపకంతో పర్యావరణ పరిరక్షణ



ఉమర్ ఆలీషా ట్రస్ట్ ఆధ్వర్యంలో మొక్కలు నాటుతున్న సోషల్ ఫారెస్ట్రీ డీఎఫ్ఓ అనూష, జిల్లా వినియోగదారుల ఫోరమ్ జడ్జి చక్కా సుశి తదితరులు



రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో మొక్కలు నాటుతున్న ఏపీఐఐసీ అధికారులు



మొక్కలను పంపిణీ చేస్తున్న ఇండియన్ డెంటల్ అసోసియేషన్ సభ్యులు

కాకినాడ రూరల్: మొక్కలు పెంచడం ద్వారా పర్యావరణ పరిరక్షణ సాధ్యమవుతుందని సోషల్ ఫారెస్ట్రీ డీఎఫ్ఓ ఎస్.అనూష పేర్కొన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా మండలంలోని వాకలపూడి గ్రామంలో శ్రీ విశ్వ విజ్ఞాన విద్యాధ్యాత్మిక పీఠం ప్రాంగణంలో ఉమర్ ఆలీషా రూరల్ డెవలమెంట్ ట్రస్ట్ ఆధ్వర్యంలో బుధవారం మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. డీఎఫ్ఐ అనూష, జిల్లా వినియోగదారుల ఫోరమ్ జడ్జి చక్కా సుశి, ఈషా ఉమెన్స్ ఆర్గనైజేషన్ అధ్యక్షురాలు డాక్టర్ రమాదేవి, కె.వీరభద్రరావు తదితరులు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. మొక్కలు నాటిన అనంతరం ఉమర్ ఆలీషా పీఠం కన్వీనర్ పేరూరి సూరిబాబు ఆధ్వర్యంలో మొక్కల పెంపకం, పర్యావరణ పరిరక్షణ అవగాహన ర్యాలీని డీఎఫ్ఓ జెండా ఊపి ప్రారంభించారు. ర్యాలీ సర్పవరం జంక్షన్ మీదుగా బోట్‌క్లబ్ వరకు నిర్వహించారు. కార్యక్రమంలో కాకినాడ లక్ష్మి, సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో..

ప్రపంచ పర్యావరణ పరిరక్షణ దినోత్సవాన్ని పురస్కరించుకుని రమణయ్యపేటలోని ఏపీఐఐసీ కాలనీలోని కార్యాలయం ప్రాంగణంలో జోనల్ మేనేజర్ రమణారెడ్డి, సిబ్బంది మొక్కలు నాటారు.

ఐడీఏ ఆధ్వర్యంలో..

బోట్‌క్లబ్: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని ఇండియన్ డెంటల్ అసోసియేషన్ రాష్ట్ర కన్వీనర్ అడ్డాల సత్యనారాయణ అన్నారు. అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. కొన్నేళ్లుగా మనం వ్యవహరిస్తున్న తీరు, పర్యావరణ వ్యవస్థ నష్టం, వాటి పరిణామాలు ఎంత ఘోరంగా ఉన్నాయో ప్రస్తుతం మనం చూస్తున్నామన్నారు. జంతువులకు సహజ ఆవాసాల ప్రాంతాన్ని కుదించడం ద్వారా అనేక ఇబ్బందులు ఉత్పన్నమవుతున్నాయన్నారు. కోతులు, పులులు, ఏనుగులు, ఆహారం కోసం పట్టణాలు, పల్లెలు బాట పడుతున్నాయన్నారు. అసోసియేషన్ అధ్యక్షుడు నాగేంద్ర మాట్లాడుతూ ప్రకృతిని ప్రేమించడం, ప్రకృతితో కలసి జీవించడం ద్వారానే మనిషి మనుగడ సరైన మార్గంలో ముందుకు సాగుతుందన్నారు. అనంతరం అసోసియేషన్ ఆధ్వర్యంలో నగరంలో పలు ప్రాంతాల్లో మొక్కలు పంపిణీ చేశారు. పర్యావరణ పరిరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలియజేసే కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు స్వరూప్, కిషన్, చైతన్య, కిరణ్, భవానీ పాల్గొన్నారు.



పెద్దాపురప్పాడు హైస్కూలులో ప్రతిజ్ఞ చేయిస్తున్న గ్రీన్ కోర్ అధికారి వెంకట్రావు

సమష్టి కృషితో పర్యావరణ పరిరక్షణ

కరప: పర్యావరణ పరిరక్షణకు సమష్టి కృషి అవసరమని హెచ్ఎం ఎస్ఎస్ఎస్ఎం శ్రీనివాస్ అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా బుధవారం పెద్దాపురప్పాడులోని బిరుదా సూర్యనారాయణ (ఫకీర్రావు) జెడ్పీ ఉన్నత పాఠశాలలో మిషన్ ఆఫ్ లైఫ్ (ఏకో క్లబ్) ఏర్పాటుచేసి ఆయన మాట్లాడారు. పెరిగిపోతున్న వాతావరణ కాలుష్యాన్ని అరికట్టేందుకు అందరూ భాగస్వాములు కావాలన్నారు. గ్రీన్ కోర్ ఆఫీసర్ తెలగాని వెంకట్రావు మాట్లాడుతూ ఏకో క్లబ్ గురించి వివరించి, విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుతామని, వాతావరణ కాలుష్యాన్ని అరికట్టేందుకు మొక్కలు నాటుతామని, విద్యుచ్ఛక్తి, ఇంధనాన్ని పొదుపుగా వాడతామని, నీటిని వృథా చేయకుండా పొదుపుగా వాడుతామని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. తర్వాత పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించేందుకు ప్లకార్డులతో గ్రామంలో ర్యాలీ నిర్వహించి, ప్రజలకు అవగాహన కల్పించారు. ఏకో క్లబ్ కన్వీనర్ బి.ఈశ్వరరాజు, సభ్యులు ఉమా శ్రీదేవి, ప్రియదర్శిని, నాగరాజేశ్వరి, గ్రీన్ సోల్జర్స్ పాల్గొన్నారు.

ప్లాస్టిక్ రహిత సమాజాన్ని నిర్మిద్దాం

- జీవ వైవిధ్యాన్ని కాపాడుదాం
- నగరపాలక సంస్థ ఏడీసీ నాగనరసింహారావు

బాలాజీచెరువు: ప్లాస్టిక్ రహిత సమాజ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యమై, జీవ వైవిధ్యాన్ని కాపాడాలని నగర పాలక సంస్థ అడిషనల్ కమిషనర్ నాగ నరసింహారావు పేర్కొన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ధరిత్రి రక్షిత సమితి, రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో బుధవారం సూర్యకళామందిరంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా నాగనరసింహారావు మాట్లాడుతూ సకల జీవాలకు ఆధారమైన భూమిని కాపాడుకోవడం అందరికీ అవసరమని, ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించి భూ కాలుష్యాన్ని తగ్గించాలన్నారు. ధరిత్రి రక్షిత సమితి అధ్యక్షురాలు సీమకుర్తి సురేఖ మాట్లాడుతూ పరిశ్రమల ద్వారా వెలువడే వ్యర్థాల వల్ల కంటే మనం వాడే ప్లాస్టిక్ వంటి వాడకాలు, మొక్కలను సంరక్షించలేకపోవడం వంటి వాటి వల్ల వాయు కాలుష్యానికి కారణమౌతున్నామని, భావి తరాలకు మంచి ఆరోగ్యవంతమైన వాతావరణం కల్పించాలన్నారు. ధరిత్రి రక్షిత సమితి ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణకు చేస్తున్న సేవలు కొనియాడారు. అనంత క్లాత్ సంచులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పొల్యూషన్ బోర్డు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సందీప్‌రెడ్డి, సమితి కార్యదర్శి నరసింగరావు, కోశాధికారి సి.మురళీకృష్ణ, జేఎన్‌టీయూకే అధ్యాపకులు ఆలపాటి శ్రీనివాసరావు, బాబీ, సోహన్, ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ క్యాడెట్లు పాల్గొన్నారు.



ధరిత్రి సంస్థ అందజేస్తున్న సంచులను ఆవిష్కరిస్తున్న నాగనరసింహారావు తదితరులు

జిల్లాలో వానజల్లులు

బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ): తీవ్ర ఉష్ణోగ్రతలు, ఉక్కపోతతో ఇబ్బందులు పడుతున్న ప్రజలు బుధవారం కురిసిన వాన జల్లులతో పులకించిపోయారు. జిల్లావ్యాప్తంగా ఉదయం నుంచి మధ్యాహ్నం 3 గంటలకు వరకూ ఎండ వేడితో ప్రజలు ఆపసోపాలు పడ్డారు. కాకినాడ నగరంతో పాటు జిల్లాలోని పలు ప్రాంతాల్లో 38 డిగ్రీల సెల్సియస్ గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. దీంతో, ఉదయం 11 గంటల నుంచే వేడిగాలులు, ఉక్కపోతతో జనం నానా ఇక్కట్లు పడ్డారు. ఈ పరిస్థితుల్లో ఉన్నట్టుండి సాయంత్రం ఆకాశం ఒక్కసారిగా మబ్బులు పట్టి, గాలులు, ఉరుములతో కూడిన వర్షం కురియడంతో ప్రజలు కాస్త సేద తీరారు. కాకినాడ నగరంలో సుమారు రెండు గంటల పాటు వర్షం పడటంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. నగరంలో పలు ప్రాంతాల్లో మోకాలి లోతు నీరు చేరడంతో ద్విచక్ర వాహనదారులు, పాదచారులు అవస్థలు పడ్డారు. సాయంత్రం వేళ కళాశాలల నుంచి విద్యార్థులు, వివిధ శాఖల ప్రభుత్వ ఉద్యోగులు ఇంటికి వచ్చేందుకు ఇబ్బందులు పడాల్సి వచ్చింది. సుమారు 6 గంటల వరకూ వాన జల్లులు పడుతూనే ఉన్నాయి. జిల్లాలోని ప్రత్తిపాడు, ఏలేశ్వరం, యు.కొత్తపల్లి తదితర మండలాల్లో కూడా వర్షం కురిసింది.



కాకినాడ విద్యుత్ నగర్‌లో రోడ్డుపై నిలిచిన నీరు

పట్టణం జలమయం

- గంటపాటు కురిసిన వర్షం
- విద్యుత్ సరఫరాకు అంతరాయం

సామర్లకోట: రాష్ట్రంలో ప్రవేశించిన రుతుపవనాలతో బుధవారం మధ్యాహ్నం భోరున వర్షం కురిసింది. ఈదురు గాలులతో వర్షం ప్రారంభం కావడంతో విద్యుత్ శాఖ అధికారులు సరఫరా నిలిపివేశారు. సుమారు గంటన్నర పాటు వర్షం కురియడంతో స్టేషన్ సెంటర్, బస్సు కాంప్లెక్స్, పెద్దాపురం రోడ్డు, జయలక్ష్మి థియేటర్ రోడ్డు, సత్యనారాయణపురం, బస్సు కాంప్లెక్స్, రైల్వే స్టేషన్, వెలమపేట, సంపెంగతోట, భాస్కర్‌నగర్, క్వారీ గోతులు నీటితో నిండిపోయాయి. ఈదురు గాలులకు పెద్దాపురం 11 కేవీ విద్యుత్ వైర్లపై చెట్టు కొమ్మలు పడడంతో మధ్యాహ్నం 3.30 నుంచి రాత్రి 7.30 వరకు విద్యుత్తు సరఫరా నిలిపివేశారు.



చెరువును తలపిస్తున్న సామర్లకోట వెలమపేట రోడ్డు



సామర్లకోట పోలీసు రింగ్ సెంటర్‌లో వర్షపు నీరు

కూటమి విజయంపై కృతజ్ఞతలు

కాకినాడ రూరల్: టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి విజయానికి కృషి చేసిన వారందరికీ కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్టు నియోజకవర్గ టీడీపీ కో ఆర్డినేటర్ పిల్లి సత్యనారాయణమూర్తి, మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి దంపతులు తెలియజేశారు. వలసపాకల గ్రామంలోని తన నివాసంలో బుధవారం మధ్యాహ్నం వారు మీడియా సమావేశంలో మాట్లాడుతూ రూరల్ నియోజకవర్గంలో పొత్తులో భాగంగా సీటు జనసేనకు రావడంతో టీడీపీ కేడర్‌లో అసహనం ఉన్నా అందరిని ఏకతాటిపైకి తీసుకువచ్చిన పంతం నానాజీ గెలుపునకు కృషి చేశామన్నారు. ప్రజల అవసరాలు తీర్చేందుకు ఎమ్మెల్యే నానాజీతో సంయుక్తంగా ప్రజల వద్దకు వెళ్తామన్నారు.

యథేచ్ఛగా వృక్ష సంపద నరికివేత

కొత్తపల్లి: అటవీ, విద్యుత్ అధికారుల సమన్వయం లోపం కారణంగా విలువైన వృక్ష సంపద నేలకొరుగుతోంది. కష్టపడి పెంచిన మొక్కలకు అటవీ శాఖ అధికారుల సంరక్షణ లేకపోవడం ఒక తీరైతే, సాంకేతిక ఇబ్బందులంటూ పచ్చని చెట్లను తొలగించడమే పనిగా పెట్టుకున్న విద్యుత్ అధికారులది మరో తీరు. మండలంలో ఉప్పాడ–పిఠాపురం రోడ్డులో మొక్కలు ఏపుగా పెరిగి రహదారికి ఇరువైపులా సుందరంగా, ఆహ్లాదాన్ని కలిగిస్తున్నాయి. వి ద్యుత్ తీగలకు అడ్డుగా ఉన్నాయన్న నెపంతో సంబంధిత అధికారులు చెట్ల కొమ్మలను యథేచ్ఛగా నరికివేస్తున్నారు. మొక్కలు నాటినప్పుడు నోరు మెదపని విద్యుత్ అధికారులు నేడు విద్యు త్ లైన్ల కోసం చెట్లను తెగనరుకుతున్నారు. పాలకులు వ్యయప్రయాసలతో ఏటా లక్షలాది మొక్కలు నాటుతుంటే, ఆ లక్ష్యాన్ని విస్మరించి ఇష్టం వచ్చినట్టు నరకడం బాధాకరమని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



ఉప్పాడ–పిఠాపురం రోడ్డులో ఉప్పాడ వద్ద నరికివేతకు గురైన వృక్షాలు